ప్రజాశక్తి

ఆదివారం 13 జులై 2025 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల

చినుకు రాలక.. సాగు సాగక..



- ముందుకు సాగని ఖరీఫ్ సీజన్
- ఈపాటికే సాగులో ఉన్న పంటలు ఎండుముఖం
- రైతులను కుంగదీస్తోన్న వర్షాభావం

నైరుతి రుతుపవనాలు వచ్చి దాదాపు 40 రోజులు గడుస్తుంది. ఇప్పటి తగినంత వర్షం కురవలేదు. దీంతో ఖరీఫ్ సాగు సంక్షోభంలో పడింది.

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు ప్రవేశించి నప్పటికీ, వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పలుమార్లు పొలాలను దున్నిన రైతులు, విత్తనాలను సిద్ధం చేసుకున్నప్పటికీ వర్షం లేక సాగుకు ముందడుగు పడలేదు. పత్తి, మొక్కజొన్న, కంది, జొన్న వంటి ఖరీఫ్ పంటలు విత్తడానికి నెలాఖరు వరకు సమయముందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు పడక పోతే సీజన్ దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ పాటికే రైతులు భూములు సాగుకు సిద్ధం చేసుకొని విత్తనాలు కొనుగోలు చేశారు. విత్తనాలు విత్తేందుకు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.



ముందుస్తుగా సాగు చేసిన పత్తి పంట

అడుగంటిన భూగర్భ జలాలు

వర్షాకాలం వచ్చినా భూగర్భ జలాలు పెరగలేదు. చెరువులు వెలవెలబోతున్నాయి. బోర్లలో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. పత్తి, మొక్కజొన్న, మిర్చి సాగు చేస్తున్న రైతులు డ్రిప్ సిస్టమ్ ద్వారా నీరు అందిస్తున్నారు. అది సుదీర్ఘకాలిక పరిష్కారం కాదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటికే భూగర్భ జలమట్టం పూర్తిగా పడి పోయింది. బోర్లలో డ్రిలింగ్ చేస్తున్నా ప్రమోజనం కనిపించడం లేదు. ఒక్కో బోరుకు రూ. లక్ష వరకూ ఖర్చు పెట్టి 800 నుంచి వెయ్యి అడుగుల లోతున కొత్త బోర్లు వేయిస్తున్నారు. వాటిలోనూ పుష్కలంగా నీరు పడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి, మామిడి, నిమ్మ, బత్తాయి, జామ బొప్పాయి పంటలు సాగు చేస్తున్న రైతులకు పరిస్థితి మరింత విషమంగా మారింది. బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో పంటలను కాపాడు కోవడం కష్టంగా మారింది.

నాట్లకు నీరులేక..

వర్షాభావం వల్ల వరి నార్లు వేసేందుకు నీరు వేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. త్రిపురాంతకం, పుల్లలచెరువు, మండలాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. యర్రగొండపాలెం, పెద్దదోర్నాల పెద్దారవీడు మండలాల్లోనూ వరి సాగవుతుంది. ముందుగానే నారు పోసిన రైతులు వాన కోసం ఎదురు చూస్తున్నారు. వాన కురవక పోతే నారు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. యర్రగొండపాలెం మండలంలో 4,500 ఎకరాల్లో పత్తి సాగు, 100 ఎకరాల్లో మొక్కజొన్న, 20 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో..

యర్రగొండపాలెం నియోజవర్గంలో 65 వేల ఎకరాలు సాగు విస్తర్ణం ఉంది. ఈపాటికే ఐదు మండలాల్లో కలిపి 20 వేల ఎకరాల్లో పత్తి, వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న, 500 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. కేవలం 30 శాతం భూముల్లోనే పంటలు సాగయ్యాయి. ఇంకా 70 శాతం భూముల్లో పంటలు సాగు చేయాల్సి ఉంది.

వర్షపాతం ఇలా...

ఈనెల 1 నుంచి 12 వరకూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం తక్కువగా నమోదైంది. యర్రగొండపాలెం మండలంలో 108.7 మిమీ సాధారణ వర్షపాతం కాగా 75.7 మిమీ నమోదైంది. పుల్లలచెరువులో 106 మిమీ గానూ ▶ 2లో

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు వేగవంతం

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి ▶ 8లో

సంక్షేమ పాలన దిశగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ▶ 5లో

అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె ▶ 8లో

గొర్రెలు, మేకల షెడ్డు ముసుగులో 'రిసార్ట్'

- సముద్రతీరంలో
- సిఆర్‌జెడ్ ఉల్లంఘన
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పర్యాటక రంగం అభివృద్ధి చెందడం ద్వారానే జిల్లా అభివృద్ధి సాధ్యమని అధికారులు భావిస్తున్నారు. అభివృద్ధి ముసుగులో తీరప్రాంతంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) ఉల్లంఘన జరుగుతోంది. అయినప్పటికీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రీసార్టుల నిర్మాణం కోసం అటవీశాఖ భూములను ఆక్రమిస్తున్నారు. మత్స్యకారులు సాగు చేసిన చౌకతోటలను తొలగిస్తున్నారు. తీరం వెంబడి ఇసుక దిబ్బలకు తొలగించి భూములను ఆక్రమిస్తున్నారు.ఆ స్థలాల్లో స్థలాల్లో వేడుకలు నిర్వహిస్తూ లక్షల రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.దీంతో స్థానిక సంస్థలకు ఆదాయం లేకుండా పోతుంది. కళ్ళ ముందే జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకుంటున్న పరిస్థితి లేదు. పత్రికల్లో కథనాలు వస్తే మొక్కుబడిగా వెళ్లి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. మరికొందరు చట్టాలను, నిబంధనలకు తుంగలో తొక్కి ఆక్రమణల పర్వాన్ని కొనసాగిస్తున్నారు .కొన్ని సందర్భాల్లో అధికారులే అక్రమార్కులకు సలహాలు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలపై జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, జిల్లాలో రిసార్ట్స్ యజమానులు కోస్టల్ రెగ్యులేషన్ చట్టానికి లోబడి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిఉంది. చీరాల వాడరేవు నుంచి రామాపురం వెళ్ళే రోడ్డులో సముద్రం ఒడ్డున గ్రాండ్ ఆర్య బీచ్ రీసార్ట్సు నిర్మించాలనుకున్న యాజవాన్యం ముందుగా అక్కడ కోహినూర్ ▶ 2లో



గొర్రెలు, మేకల షెడ్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు



గొర్రెలు, మేకల షెడ్ పేరుతో నిర్మించిన గ్రాండ్ ఆర్య బీచ్ రిసార్ట్



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

దళితులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

- నేడు విజయవాడలో ప్రజాసదస్సు
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం దళితులను దగా చేస్తుందని కుల వివక్షత వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి దుయ్య బట్టారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్ తో కలసి స్థానిక ఎల్‌బిజి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాల్యాద్రి మాట్లాడారు. గత పదేళ్లుగా ఎస్‌సిలకు అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరు గారుస్తుందని ఆరోపించారు. బాబూ జగజ్జీవన్ రామ్ పేరుతో ఎస్‌సిలకు 200 యూనిట్లు ఉచితంగా అందించే విధానం ఒంగోలు నగరంలో అమలు కావడం లేదన్నారు.తమ బందం శనివారం మామిడిపాలెం, గద్దలగుంటలో పరిశీలించగా ఉచిత విద్యుత్ పథకం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. రకరకాల సాకులు చూపి వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. తాము 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అమలుకు డిమాండ్ చేస్తుండగా 200 యూనిట్లకు వసూలు చేయడం పట్ల అక్షేపణ వ్యక్తం చేశారు.ఎస్‌సిలకు ఉచిత ▶ 2లో

దళితులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా ఎస్‌సిలందరికీ ఎలాంటి షరతులూ లేకుండా సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై వైసిపి ప్రభుత్వం ఆదానితో కుదుర్చుకున్న సెకి ఒప్పందాన్ని దుర్మార్గమని, స్మార్ట్ మీటర్లు పగుల గొట్టాలని అప్పట్లో పిలుపునిచ్చిన నారా లోకేష్ అధికారం చేపట్టగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయ విద్యుత్ మీటర్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటును అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో దళితులపై, దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు. ప్రభుత్వం నేరస్తులకే అండగా నిలుస్తుందని ఆరోపించారు. దళితులపై జరుగుతున్న అమానవీయ దాడులపై నిర్వహించాల్సిన మానిటరింగ్ కమిటీలు నిర్వహించకపోవడం విచారకరమన్నారు. స్వయాన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరంజనేయస్వామి నియోజకవర్గలోనే దళితులపై జరిగిన ఘటనను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి కమిటీ చైర్మన్‌ను నియమించి 3 నెలలు కావస్తున్నప్పటికీ చైర్మన్ హోదాలో జవహర్ ఇప్పటివరకూ ఎస్‌సిలు దాడులకు గురైన గ్రామాల్లో సందర్శించ లేదని విమర్శించారు. రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడులపై ఎస్‌సి కమిషన్ విచారించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి సబ్ ప్లాన్ క్రింద గ్రౌండ్ చేసిన 7 లక్షల మంది లబ్ధిదారులకు తక్షణమే రుణాలు అంది చాలన్నారు. ఎన్నికల హామీల మేరకు 50 ఏళ్ళు నిండిన ఎస్‌సి,ఎస్‌టి, బీసీ, మైనారిటీలకు వద్ధాప్యపు పెన్షను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం విజయవాడలో ప్రజాసదస్సు నిర్వాహిస్తున్నట్లు మాల్యాద్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

గొర్రెలు, మేకల షెడ్ పేరుతో 'రిసార్ట్'

(మొదటిపేజీ తరువాయి)

గొర్రెలు,మేకల షెడ్డులు నిర్మిస్తున్నట్లు బోర్డు పెట్టారు. ఆ భూమి అసైన్డ్ భూమిగా పేర్కొంటూ పట్టాదారుడి పేరుతో బోర్డు పెట్టారు. దశాబ్దాలుగా ఉన్న తాటిచెట్లను తొలగించి వాటి తోనే గదుల నిర్మాణాలను ఆధునిక పద్ధతులతో నిర్మించారు. అది చూసిన వారు ఆధునిక పద్ధతుల్లో గొర్రెలు, మేకల పెంపకం షెడ్డులు నిర్మిస్తున్నట్లుగా భావించారు. మూడు నెలల తర్వాత చూస్తే అది రీసార్టు అని అర్థం అయ్యింది. గొర్రెలు,మేకల పెంపకం షెడ్డుల పేరుతో నిర్మించిన గ్రాండ్ ఆర్య బీచ్ రీసార్టు రూములు ఇవి. ఎసి రూములతో పాటు, ఫుడ్ కోర్టు కూడా పెట్టారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ ఉల్లంఘనతో పాటు అన్ని నియమనిబంధనలను తుంగలో తొక్కి వీటిని నిర్మించారు. ఎదురుగా ఉన్న ఇసుక దిబ్బలను తొలగించారు. ఇలా అక్రమ మార్గాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్న రీసార్టుల వల్ల కొందరు అధికారులు, నేతలకే ప్రయోజనం తప్ప, స్థానిక సంస్థలకు కాని ప్రభుత్వానికి కాని ఎలాంటి ఆదాయం వచ్చే పరిస్థితి లేదు.

చినుకు రాలక.. సాగు సాగక..

(మొదటిపేజీ తరువాయి)

74.8 మిమీ నమోదు అయ్యింది. త్రిపురాంతకంలో 107 మిమీ గానూ 51.8 మిమీ, దోర్నాలలో 91.8 మిమీ గానూ 81.6 మిమీ, పెద్దారవీడులో సాధారణ వర్షపాతం 89.8 మిమీ గానూ 75.1 మిమీ నమోదు అయ్యింది.

రెండేళ్లుగా సరైన వానలు లేవు

దుగ్గినేని శివయ్య, ఉపాధి కూలీ, వాదంపల్లి



రెండేళ్ల నుంచి వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి ఏడాది మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేస్తా. ప్రస్తుతం వాన జాడ లేదు. బోర్లలో చుక్క నీరు లేదు. దీంతో నారు పోసేందుకు విత్తనాలు కూడా కొనుగోలు చేయలేదు.

పత్తి పంట సాగు చేశాను

కైపు వెంకట కోటిరెడ్డి, రైతు, మురారిపల్లి



ఐదు ఎకరాల్లో పత్తి పంటసాగు చేశాను. మొక్కలు బతికించుకున్నాను. బోరులో నీళ్లు అంతంత మాత్రమే ఉన్నాయి. వర్షం కురిసి బోర్లలో నీళ్లు పెరుగు తాయనే ఆశతోనే పైరు పోశాను. చివరకు ఏమవుతుందో చూడాలి.

పంటవాడిపోతుంది

తెల్లమేకల చిన్న రాజయ్య, రైతు, మురారిపల్లి



నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా.బోర్లలో నీటి మట్టం తగ్గింది. నీరు పంట వాడు ముఖం పడుతోంది. ఏం చేయాలో తెలియడం లేదు. నీళ్లు తగ్గడంతో వథా కాకుండా డ్రిప్ సాయంతో పంటకు నీళ్లు పెడుతున్నాం. వర్షం కురిస్తే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదు.

112 సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మాట్లాడుతున్న ఎస్ఐ చౌడయ్య

ఆపదలో ఉన్నప్పుడు డయల్ 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలని యర్రగొండపాలెం ఎస్ఐ పి చౌడయ్య సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ డయల్ 112తో కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. పోలీసు సహాయ నంబరు 112ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కుటుంబ తగాదాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, అనుమానా స్పద వ్యక్తుల కదలికలు తదితర వివరాలను 112కు ఫోన్ చేయాలన్నారు. 112కు ఫోన్ చేస్తే వెంటనే రక్షక్ పోలీసులు మూడు నుంచి పది నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. మండల ప్రజలు గతంలో పోలీసు హెల్ప్ లైన్ నెంబరుగా 100 ఉండేదని, దాని స్థానంలో ప్రస్తుతం 112 నెంబరును ప్రభుత్వం మార్చినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని ప్రజలు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వారి నివాసాలకు రక్షణ కల్పించేలా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు, ఊళ్లకు వెళ్లినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందిస్తే మీ పరిధిలో ఉన్న పోలీసులు మీ ఇంటిని నిరంతరం నిఘా పెడతామన్నారు. దీంతో చోరీలను కట్టడి చేయొచ్చని పేర్కొన్నారు.

పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా

అనుమతి ఉన్నా కప్పం కట్టాలంటూ బెదిరింపు

జెసికి ఫిర్యాదు చేసిన లారీ, గృహ యజమానులు

మైనింగ్ అధికారుల చొరవతో ఇసుక అన్లోడ్



ఫిర్యాదు చేసిన గృహ యజమాని



ఇసుక అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పొదిలి

గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రధానమైన ఉచిత ఇసుక ఆచరణలో అబాసు పాలవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత ఉచిత ఇసుక ఇచ్చిన దాఖలా లు లేకపోగా గత వైసిపి ప్రభుత్వాన్ని మించి ఇసుక దందా కొనసాగుతోంది. ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టామనే పేరుతో స్థానిక శాసనసభ్యులు వారి అనుచరులు పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారు. అందులో భాగంగా ప్రతి మండల కేంద్రంలో ఇసుక రీచ్ పాయింట్ ఏర్పాటు చేసి వారి ద్వారానే కొనుగోలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఉచిత ఇసుక విధానం ఎక్కడ అమలు కాకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ఈ సందర్భంగా గృహ నిర్మాణాల సంఖ్య తగ్గిపోయింది. ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకున్నా ఇక్కడ ఇసుక మాఫియా వారికి డబ్బులు కట్టాల్సి రావడంతో ఆర్థికంగా భారం పెరిగి మాఫియా భయంతో నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ఈ క్రమంలో స్థానిక గృహ నిర్మాణదారులు కొందరు ఇసుక మాఫియా రేటుకి భయపడి ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకుని లారీల ద్వారా తెప్పించుకుంటున్నా వాటిని అడ్డుకుంటున్న ఇసుక మాఫియాతో స్థాని మూడు రోజులుగా లారీలో ఇసుక అన్లోడ్ చేయకుండా అడ్డుకుంటున్నారు.

ఈ విషయంపై సదరు గృహ నిర్మాణ యజమాని, లారీ డ్రైవర్ స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. దీంతో వారు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చే యడంతో ఆయన స్పందించి ఈ విషయాన్ని పరిశీలిం చమని మార్కాపురం మైనింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం పొదిలికి వచ్చిన మార్కాపురం మైనింగ్ అధికారు లు లారీలకు సంబంధించి గృహ యజమానితో మాట్లాడి ఇసుక కొనుగోలు సంబంధించిన కాగితాలను పరిశీ లించారు. అన్నీ సక్రమంగా ఉండటంతో ఇసుకను అన్లోడ్ చేయించి పంపించారు. గత ఏడాది కాలంగా ఇలా ఇసుక నేరుగా తెచ్చుకోలేక చాలామంది గృహ యజమానులు నిర్మాణాలను మొదలు పెట్టకుండా వాయిదా వేసుకుంటున్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కనుసన్నల్లోనే స్థానిక స్టాక్ పాయింట్ ఇసుక మాఫియా నడుపుతోందని స్థానికులు అంటున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పలీసులు

బస్సు, బైక్ ఢీ.. యువకుడు మృతి

ప్రజాశక్తి-పొదిలి

ఒంగోలు-నంద్యాల రహదారిపై ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. పొదిలి మండలంలోని కాటూరివారిపాలెం- అగ్రహారం గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై ఒంగోలు నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పొదిలి నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న మోటార్ బైక్‌ను ఢీ బైక్‌పై ప్రయాణిస్తున్న మర్రిపూడి మండలం శివరాయుని పేట గ్రామానికి చెందిన మోడీ నెహెమియా(35) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జు నుజ్జు అయింది. ప్రమాదం విషయం తెలుసుకున్న పొదిలి సిఐ టి.వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి-దొనకొండ

అక్రమ మద్యం విక్రయాలు అరికట్టడంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దర్శి ఎక్సైజ్ సీఐ కె శ్రీనివాసరావు నేతృత్వంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దొనకొండ గ్రామానికి చెందిన చలమయ్య అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వాహణ నిమిత్తం అక్రమంగా నిల్వ ఉంచిన 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేయటం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దొనకొండ మండలంలో గత ఏడు నెలల కాలంలో 30 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ వీఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

16న జాబ్ మేళా

ప్రజాశక్తి-దర్శి : ఈనెల 16వ తేదీన స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు గౌతమి విద్యాసంస్థల చైర్మన్ కనుమల్ల గుండారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన పానాసోనిక్, డీమార్ట్, హెచ్‌డిఎఫ్‌సి, ఫ్లిప్‌కార్ట్, డక్కన్, హైడ్, హుండాయ్, అపోలో వంటి కంపెనీలు హాజరవుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కనుమల్ల గుండారెడ్డి, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబులు తెలిపారు.

విభజన హామీల అమలుకు ఛలో ఢిల్లీ

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-దర్శి

కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఛలో ఢిల్లీ నిర్వహించడం జరుగుతుందని నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి.పిచ్చయ్య తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఛలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవి.పిచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు అనేకం ఇచ్చారని కానీ నేటికీ అవి అమలు దిశకు చర్యలు చేపట్టడం లేదన్నారు. ముఖ్యంగా విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారు కానీ ఇప్పుడు అది ముగిసిన అధ్యాయమని అంటున్నారని తెలిపారు. తిరుపతిలో జరిగిన సభలో తిరుమల వెంకన్న సాక్షిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐదు సంవత్సరాల హోదా ఇస్తామని ఇప్పటికే ఏం లేదన్నారు. హోదా ఇవ్వకపోవడానికి కేంద్రానికి ఉన్న అడ్డంకులు ఏమిటని ప్రశ్నించారు. దొనకొండలో పారిశ్రామిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పరిశ్రమలు వస్తే వలసలు కరువు తీరుతుందన్నారు. 32 మంది ప్రాణ బలిదానంతో ఏర్పరుచుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కేంద్రం భాగస్వామ్యంలో కీలక భూమిక పోషిస్తున్న తరుణంలో ఇదే సరైన సమయం అని కేంద్రం పై ఒత్తిడి తెచ్చి విభజన హామీలు అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని విభజన హామీలు కూడా ఉన్నాయని, వెనుకబడిన ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం ముఖ్యమేనన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగి యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. 18న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే మహా ధర్నాలో యువత పాల్గొని జయప్రదం పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఆర్ జెసి పాల్, మండల నాయకులు షేక్.పీరాసాహెబ్, కళ్యాణ్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



రంగారావు మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

రంగారావు అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి టిడిపి సీనియర్ నాయకులు కొండ్రగుంట రంగారావు గుండె పోటుతో గురువారం మృతి చెందడంతో శనివారం ఈదుమూడిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బిఎన్ విజయ కుమార్ రంగారావు మృతదేహంపై టిడిపి జెండాను కప్పి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రటరీ కాకర్ల లక్ష్మి వరప్రసాద్, క్లస్టర్ ఇంచార్జి గుమ్మడి సాయిబాబా, లంబు నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కుర్ర వీరాంజనేయులు, ఆళ్ళ ప్రేమ్ చంద, కనగాల శ్రీనివాసరావు, ముద్దన రవి, జాన్సన్, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు నివాళులర్పించారు.



కరపత్రాలు పంచుతున్న దామచర్ల సత్య

టీడీపీతోనే సుపరిపాలన

ప్రజాశక్తి-మర్రిపూడి

తెలుగుదేశంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. శనివారం మండల కేంద్రమైన మర్రిపూడిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పథకాలను అమలు చేస్తున్న ఘనత టిడిపికి దక్కిందన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎర్రమోతు శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ గొంటు హనుమారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా జనరేటర్

నిర్వహణను పట్టించుకోని అధికారులు


తహశీల్దార్ కార్యాలయంలో ఇబ్బందులు

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే కార్యాలయ పనులకు, ప్రజల సేవలకు అవసరమైన పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం లక్షలు వెచ్చించి తహశీల్దార్ కార్యాలయం వద్ద జనరేటర్ సౌకర్యం కల్పించింది. అయితే ఆ జనరేటర్ నిర్వహణను కార్యాలయ అధికారులు, సిబ్బంది పట్టించుకోక పోవడంతో అది నిరుపయోగంగా మారి కార్యాలయం వద్ద అలంకారప్రాయంగా మిగిలింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు సిబ్బంది ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సోమవారం మధ్యాహ్నం సమయంలో దాదాపు గంటకు పైగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో కార్యాలయ సిబ్బంది ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. వివిధ ధ్రువ పత్రాల కోసం వచ్చిన ప్రజలు టీ బంకుల వద్ద కాలక్షేపం చేయాల్సి వచ్చింది. అధికారులు స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న జనరేటర్



విద్యుత్ లేక ఖాళీగా ఉన్న కార్యాలయ సిబ్బంది

విద్యారంగంపై ప్రపంచీకరణ ప్రభావం

గంగవరం పాఠశాల 70వ వార్షికోత్సవ సభలో చైర్మన్ వి కృష్ణయ్య

ప్రజాశక్తి - పంగులూరు

విద్యా రంగంపై ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో ప్రభుత్వ విద్యకు ముప్పు ఏర్పడిందని, తమ పాఠశాలకు కూడా అనేక ఒత్తిళ్ళు వచ్చాయని, ఆ ఒత్తిళ్లు తట్టుకొని పాఠశాల నిలబెట్టేందుకు పూర్వ విద్యార్థులంతా కృషి చేయాలని ఇంకొల్లు మండలం గంగవరంలోని ఒలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ ఒలేటి కృష్ణయ్య కోరారు. పాఠశాల 70వ వార్షికోత్సవ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావం తమ పాఠశాలపై కూడా పడిందని అన్నారు. పాఠశాలను ప్రభుత్వంలో కలిపేయాలని అనేక ఒత్తిళ్లు వచ్చాయని అన్నారు. అయితే పాఠశాలను విలీనం చేయకుండా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. 200ఏళ్లకుపైగా పాఠశాలను నిలబెట్టుకోవాలని గ్రామస్తులు తీర్మానించుకున్నారని చెప్పారు. పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని, విద్యార్థుల సంఖ్య పెంచుకోవడంతో పాటు మౌలిక వసతులు కల్పించుకోవాల్సి ఉందని అన్నారు. అందుకు పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. పాఠశాలను ఉన్నతంగా నడిపేందుకు కృషి చేయాలని కోరారు. 70ఏళ్ళ క్రితం ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చెంది చుట్టుపక్కల 10 గ్రామాలకు దిక్సూచిగా మారిందని, ఇప్పటి వరకు సుమారు 3700 మంది విద్యార్థులకు చదువులు అందించిందని చెప్పారు. పాఠశాల్లో చదివిన పూర్వ విద్యార్థులు 100 మందిపైగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారని, ఐదారు వందల మంది ఉన్నతమైన చదువులు చదివి బయటి రాష్ట్రాల్లోనూ ఉన్నారని చెప్పారు. వెయ్యి మందికిపైగా ఉద్యోగాల్లో ఉన్నారని



మాట్లాడుతున్న పాఠశాల కమిటీ చైర్మన్ వలేటి కృష్ణయ్య

చెప్పారు. అనేక మంది ఉపాధ్యాయులుగా ఉండి రాబోవు తరాలకు విజ్ఞానాన్ని అందిస్తున్నారని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడైనా ఎవరి దగ్గర విజ్ఞానం ఉంటుందో వాళ్లే రారాజులని, అమెరికాలో 24 సాఫ్ట్వేర్ కంపెనీలో భారతీయులు సిఇఒలుగా ఉన్నారని చెప్పారు. ఇది భారతీయులందరికీ గర్వకారణమని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి వై సిద్దయ్య మాట్లాడుతూ ఒలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులకు చదువు నేర్పటం తోపాటు సమాజం కోసం పనిచేసే అనేక మంది వ్యక్తులను తయారు చేసిందని చెప్పారు. స్వాతంత్ర స్ఫూర్తి, ఆర్య సమాజ స్ఫూర్తి, కమ్యూనిస్టు స్ఫూర్తి అనే మూడు అంశాలను తీసుకొని పాఠశాల పని చేసిందని చెప్పారు. గ్రామంలోని అనేక మంది పెద్దలు విద్య, వైద్యం, రోడ్డు సౌకర్యం కోసం కృషి చేశారని, అందుకే గంగవరంకు గురువుల గురుకులమని పేరు ఉందని చెప్పారు. గ్రామంలో యువజన సంఘం ఏర్పాటు చేసి అనేక సామాజిక సమస్యలపై యువకులను ఏకం చేసిన స్ఫూర్తి పాఠశాలదని అన్నారు. దళితులు చెరువులో నీళ్ల ముంచుకోవటం కోసం, పెళ్లిళ్ల సమయంలో ఊరేగింపులు చేసుకోవడం కోసం యువజన సంఘం అండగా నిలబడి కృషి చేసిందని చెప్పారు. పాఠశాల్లో గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు, ట్యూషన్లు పెట్టి సమాజం గురించి ఆలోచించే యువకులను తయారు చేసిందని చెప్పారు. ఇప్పుడు ఈ పాఠశాలను కాపాడుకొని ఆ వారసత్వాన్ని నిలబెట్టుకునే బాధ్యత పూర్వ విద్యార్థులపై ఉందని అన్నారు. పూర్వ విద్యార్థులు ఆలోచించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు, మాజీ డైరీ చైర్మన్ బాలిన రామ సుబ్బారావు, డాక్టర్ మంచాల రమేష్ కుమార్, ఆరికట్ల ప్రసాద్, మాజీ జెడ్పిటిసి కరి వెంకట సుబ్బారావు, దూళిపాళ్ల వీరనారాయణ, కొండపల్లి శేషగిరిరావు తదితరులు మాట్లాడుతూ పాఠశాల్లో తాము విద్యార్థులుగా ఉన్న సమయంలో జరిగిన విషయాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న సంవత్సరాల వారీగా స్నేహితులు కలిసి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు సంప్రదించుకొని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు పాఠశాల వ్యవస్థాపకులు వలేటి కృష్ణయ్య, తాడిపత్రి బద్రిరెడ్డి చిత్రపటాలకు పూల మాల వేసి నివాళు లర్పించారు. పాఠశాల ఉపాధ్యాయురాళ్లు దుర్గా, సుమలత, జానకి, కృష్ణవేణి, రాధా, విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో గంగవరం ఎంపిటిసి రాజగోపాలరెడ్డి, సర్పంచ్ బెల్లం సుధాకర్, ఇంకొల్లు గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణాధికారి ఎం శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు ఎం సమత, చిలుకూరు వీరనారాయణ, గంగవరం దేవాలయం చైర్మన్ వలేటి శ్రీనివాసరావు, వలేటి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - బాపట్ల



సిహెచ్ మజుందర్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు సిఐటియు మద్దతు ప్రకటిస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ శనివారం తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులు కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంజనీరింగ్ కార్మికులకు వర్తింపచేయాలని కోరారు. గత ఏడాది జరిగిన 17 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ కార్మికులు తలపెట్టిన సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోపోవడంతో తప్పని పరిస్థితుల్లో కార్మికులు సమ్మెలోకి దిగాల్సి వచ్చిందని అన్నారు. దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జరిగే ఆందోళనకు అన్ని కార్మిక సంఘాలు, ప్రజలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.



గేట్ మీటింగులో మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - అద్దంకి

అర్ధరాత్రి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెను బలపర్చాలని సిఐటియు నాయకులు తంగిరాల వెంటేశ్వర్లు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం మస్టర్ పాయింట్లో గేట్ మీటింగ్ వద్ద నిరసన తెలిపారు. జిఒ నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత పది రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. అందులో భాగంగా శనివారం గేటు మీటింగు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉసురుపాటి శామ్యూల్, ప్రేమ్, యెహెూషువ, మార్కు, మారుతి, కోటేశ్వరరావు, గిరి, వడివేలు పాల్గొన్నారు.



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కేజీపాలెంలో సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని ప్యాపర్రు, బోడపాడు, కెజి పాలెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సందర్భంగా ఆయా గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు శనివారం ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సిసి రహదారులు ప్రారంభించిన అనంతరం గ్రామంలోని ఇంటి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ప్రచురించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నమోదు చేసుకున్నారు. ఆ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి సంక్షేమం సమ దృష్టితో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణ కుమారి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అమ్మ' చందుకు భారత సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



అవార్డు అందుకుంటున్న గుంటుపల్లి చందు

వృద్ధులు, అనాథలు, నిరాశ్రయులకు 'అమ్మ' ఆశ్రమం ద్వారా నిత్యం అన్నదానం చేస్తూ భరోసా కల్పిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు గుంటుపల్లి చందుకు అత్యుత్తమ పురస్కారం లభించింది. భారత ప్రభుత్వ రంగ సంస్థ నీతి అయోగ్చే గుర్తింపు పొందిన హైదరాబాద్కు చెందిన సామాజిక సేవా సంస్థ 'మనం ఫౌండేషన్' ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ ప్రాంగణంలో నిర్వహించిన 9వ వార్షికోత్సవ వేడుకల్లో భారత సేవా రత్న జాతీయ అవార్డు అందజేశారు. గత ఆరేళ్లుగా పేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, వృద్ధులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్న అమ్మ ఆశ్రమం సేవలను గుర్తించి మనం ఫౌండేషన్ అధినేత డాక్టర్ చక్రవర్తి అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ దాతల సహకారంతో తాను ఈ సామాజిక సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోటరీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



ప్రమాణ స్వీకారం చేస్తున్న రోటరీ నూతన కార్యవర్గ సభ్యులు

రోటరీ సేవలను విస్తృతం చేసేందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని 3150 రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్వి రాంప్రసాద్ కోరారు. 2025-26కు స్థానిక నాగరాజుపల్లి రోడ్డులోని రోటరీ, శ్రీకారం కళాపరిషత్తు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన రోటరీ కార్యవర్గ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనలో రోటరీ విశేష కృషి చేసిందని అన్నారు. 200పైగా దేశాల్లో 36వేల శాఖలతో ప్రస్తుతం అనేక రంగాల్లో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రోటరీ సభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరూ అద్భుతమైన ఫలితాలు సాధించి ప్రజలకు చేరువకావచ్చని తెలిపారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపికైన మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, నూతన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ జిల్లా చైర్మన్ అన్నె రత్నప్రభాకర్, ఇండక్షన్ ఆఫీసర్గా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, జాష్టి వెంకట మోహనరావు, ఇంటూరి ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, షేక్ కాజా హుస్సేన్, ఈశ్వర ప్రసాద్, చెరుకూరి అంజిబాబు, కందిమళ్ళ రవిబాబు పాల్గొన్నారు.



సిసి కెమేరాలు ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ ఖాదర్బాషా

దగ్గుబాడులో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని దగ్గుబాడులో శనివవారం సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాల ఏర్పాటును ఎస్ఐ ఖాదర్ బాషా పర్యవేక్షించారు. దాతల సహకారంతో రూ.3 లక్షల ఖర్చుతో దగ్గుబాడు గ్రామం చుట్టుపక్కల, గ్రామం మధ్యలో 36 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపారు. ఈ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటలు, చోరీలు జరిగిన వెంటనే నిందితులను కనుగొనేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ నాయకులు ఖాసిం ఉన్నారు.

నేడు గంగవరంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

ఇంకొల్లు మండలం గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రెగ్యులర్ షుగర్, బీపీ వైద్య శిభిరం ఈనెల 13న ఆదివారం మంచాల వెంకటరామయ్య, రంగమ్మ విద్యా, వైజ్ఞానిక కళ్యాణ వేదికలో జరుగుతుందని వైద్య శిభిరం కన్వీనర్ కరి బాలచంద్రం శనివారం తెలిపారు. ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. బిపి, షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ మంచాల రమేష్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అన్నవరపు సాంబయ్య వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. మంచాల వెంకటరామయ్య, రంగమ్మ, కోటు అనంత విజయలక్ష్మి, మంచాల రవిబాబు, శంకరశెట్టి రామయ్య ధర్మపత్ని కోటమ్మ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు డాక్టర్ మంచాల రమేష్ కుమార్, శంకరశెట్టి శ్రీనివాసరావు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. తినక ముందు, తర్వాత షుగర్ పరీక్షలు చేయించుకుని రావాలని, బీపీ పరీక్ష చేపించుకొని రావాలని కోరారు. గంగవరం పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గత ప్రభుత్వ విధానాలే..

కూటమి ప్రభుత్వమూ అనుసరిస్తోంది

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్

ప్రజాశక్తి -చీమకుర్తి

విద్యారంగ విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే స్వల్ప మార్పులతో కూటమి ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్–ఎస్. ప్రసాద్ తెలిపారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగంలో మౌలిక మార్పులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుందన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశానుసారం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది మూడు లక్షల అడ్మిషన్లు తగ్గిపోయినట్లు తెలిపారు. తల్లికి వందనం కార్యక్రమం పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగేందుకు దోహద పడలేదని తెలిపారు. యాప్‌లు రద్దు చేసినప్పటికీ ఒకే యాప్‌లో అని రకాల పనులు చేయాల్సి రావడంతో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిపై పనిభారం, ఒత్తిడి పెరిగినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి నాణ్యమైన విద్యనందిస్తూ పాఠశాల పట్ల నమ్మకాన్ని కలిగిస్తూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యనందించటమే ఉపాధ్యాయులు తమ ప్రధాన కర్తవ్యంగా భావించాలని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల ప్రమోషన్లు, బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులకు జీతాల సమస్య రాకుండా వెంటనే పొజిషన్ ఐడీలు, క్యాడర్ స్టంట్ వివరాలను తెప్పించాలని డిటిఎను కోరారు. కౌన్సిలింగ్‌లో బదిలీలు పొంది రిలీవర్స్ రాక నిలిచిపోయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలు, సంక్షేమం పైపోరాటం చేస్తుందన్నారు. యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరం, బాలోత్సవాలు ఎంతో ఆదరణ పొందినట్టు తెలిపారు. అనంతరం 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ బహుమతులు అందజేశారు. 2023 నుంచి 2025 వరకూ ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులను, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్. రవి, జి.ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్.చిన్నస్వామి, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, పి.బాల వెంకటేశ్వర్లు, సిహెచ్.ప్రభాకర్ రెడ్డి, ఎం.సంధ్యారాణి, ఆల్ ఫంక్షన్ హాల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు జివి.శేషయ్య, యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.అక్బర్, చలువాది శ్రీనివాసరావు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, సహ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఎన్ఎల్.శివ పార్వతి, జిల్లా నాయకులు ఎస్‌కె.శిలార్, పి.రమేష్, పి.భాస్కరరావు, పి.దేవదాసు, పొత్తూరి రమేష్, బొడ్డు బ్రహ్మయ్య, మల్లికార్జున, శ్రీనివాస్, ఏడుకొండలు, నాగార్జున, చల్లా శ్రీనివాస్, లక్ష్మీరాజ్యం, సిఐటియు జిల్లా నాయకులు పూసపాటి వెంకట్రావు, పెన్షనుదారుల సంఘం అధ్యక్షుడు మర్రి లక్ష్మీనారాయణ, ఎన్.హరిప్రసాద్, పీరు సాహెబ్, బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు



శంకుస్థాపనలో ఎమ్మెల్యే దామచర్ల

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. స్థానిక కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ నుంచి శ్రీరామ్ నగర్ వరకు రూ.94 లక్షలతో నిర్మిస్తున్న డిఐ పైపులైన్‌కు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అమృత్ 2.0లో ఒంగోలు నగరంలోని ప్రజలందరికీ ప్రతి రోజు తాగునీరు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పైపులైన్ ద్వారా 43, 44, 45 డివిజన్ల ప్రజల తాగునీటి సమస్యలు తీరుతాయన్నారు. పైపులైన్ నిర్మాణాన్ని 2 నెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, టిడిపి నగర అధ్యక్షుడు బండారు మదన్, టిడిపి నాయకులు రాచగర్ల వెంకట్రావు, కుప్పా రంగనాయకులు, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన దిశగా కూటమి ప్రభుత్వం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో సంక్షేమ పాలన దిశగా కూటమి ప్రభుత్వం పయనిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు నగరం 44, 45 డివిజన్లల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యమ్రం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహళలు ఎమ్మెల్యే దామచర్లకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. 44, 45 డివిజన్లలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి కరపత్రలు అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు పేరిట వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అమ్మ ఒడి పథకాన్ని ఇద్దరు పిల్లలకు ఇస్తామని ఒకరికే ఇచ్చారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు నేటికీ తిరుగుతున్నారన్నారు. సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేస్తామని కల్తీ మద్యాన్ని విక్రయించి ప్రజల ప్రాణాలు హరించారన్నారు. ఇసుక, మద్యం మాఫియా రాజ్యమేలిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వ్యవస్థల పునర్నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. ఒంగోలు నగరాన్ని ప్రత్యేక ప్రణాళికతో సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. డివిజన్లలో ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టామన్నారు. నగరంలో సుశాలమైన రోడ్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టామన్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, కాలవల పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రానున్న కాలంలో ఒంగోలు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, టిడిపి నగర అధ్యక్షుడు బండారు మదన్, టిడిపి నాయకులు రాచగర్ల వెంకట్రావు, కుప్పా రంగనాయకులు, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు ,డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



రవికాంత రెడ్డిని సన్మానిస్తున్న గోరంట్ల రవికుమార్

'శ్రీహర్షిణి' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎల్.రవికాంత రెడ్డికి నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ జె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఫిటో కెమికల్ అనాలసిస్ సింథసిస్ క్యారెక్టరైజేషన్, యాంటీ బ్యాక్టీరియల్ యాక్టివిటీ, బయోలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ మెటాలిక్ (సిల్వర్, కాపర్ ఆక్సైడ్, జింక్ ఆక్సైడ్)నానో పార్టికల్స్ ఆఫ్ యుఫర్ బియా సెర్పెన్స్ లీఫ్ ఎక్స్ట్రాక్ట్ పరిశోధన గ్రంథాన్ని సమర్పించటంతో ఎఎన్‌యు రవికాంత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసింది. పిహెచ్‌డి సాధించి. రవికాంతరెడ్డికి శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, కళాశాల డీన్ డిఆంజనేయులు, జిఎం శివరామ్, పిజి కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసుల రెడ్డి, ఎఒ ర్యాంకర్ శ్రీను క్యాంపస్ ఇన్‌ఛార్జి ధిరీష్ , ప్రతాప్, అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

అంధుల పాఠశాలకు నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దొడ్లా వెంకట సాయిశ్రీ జోష్ణిక పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు అంకారావు సౌజన్య దంపతుల ఆర్థిక సహకారంతో గుడ్ న్యూస్ మినిస్ట్రీ అంధుల పాఠశాలకు నిత్యావసర వస్తువులైన బియ్యం, కందిపప్పు, నూనె, కాస్మోటిక్స్, పండ్లు అందజేశారు. స్థానిక కర్నూల్ రోడ్ రావి అంజయ్య బజార్‌లోని పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ అంధులైన విద్యార్థులు చదువులో బాగా రాణిస్తున్నారని, వీరి చదువుకు దాతలు అండగా నిలవాలన్నారు. అంధ విద్యార్థుల పట్ల అందరూ ఆదరణ చూపాలన్నారు. విద్యార్థులకు నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు అందించి మానవత్వం చాటిన దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు స్వర్ణ మోహన్ రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలం గుండంచర్ల పంచాయతీ పరిధిలోని నల్లమల అడవి ప్రాంతంలోనున్న వేనూతల కాటంరాజు గంగాభవాని దేవస్థానానికి ప్రత్యామ్నాయ రహదారి కోసం అధికారులు శనివారం స్థల పరిశీలించారు. దేవస్థాన చైర్మన్ గుమ్మ గంగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నల్లమల అడవి లోతట్టు ప్రాంతాల్లో పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్టు రానున్న నేపథ్యంలో కాటంరాజు దేవస్థానానికి మార్కాపురం వైపు నుంచి వెళ్లే దారి మూసుకుపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆలయ కమిటీ ఇటీవల మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్‌కు రహదారి సమస్య గురించి వివరించారు. దీంతో సబ్ కలెక్టర్ రహదారి ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్,ఇతర అధికారులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పిఎల్‌పి. యాదవ్, ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, గంగుల యల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల కిరణ్

నాబార్డు సేవలపై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచేందుకు, గ్రామీణ అభివృద్ధికి తోడ్పడే విధంగా భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఐఈఈఆర్డి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ బత్తుల కిరణ్, వెంకట్రావు అన్నారు. నా బార్డ్ 44వ స్థాపన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ గోవిందా అంబికా పరమేశ్వరి జూనియర్ కళాశాల్లో విద్యార్థినీ విద్యార్థులకు నా బార్డు చేపడుతున్న సేవలపై శనివారం అవగాహన కల్పించారు. అక్షరాస్యత, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మహిళా శక్తి వంటి రంగాల్లో నాబార్డు పాత్రపై వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్ రామాంజనేయులు, కరస్పాండెంట్ బి నాగార్జున పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న గుర్రం మురళీమోహన్రావు

మురళీమోహన్‌కు పద్మ ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన రావుకు 'మనం ఫౌండేషన్' 9వ వార్షికోత్సవం సందర్భంగా భారత పద్మ ప్రతిభ అవార్డు అందజేశారు. త్యాగరాజు గాన సభలో దక్షిణ భారతదేశంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని స్వచ్ఛందంగా గుర్తించి అవార్డులు ప్రధానం చేస్తున్నారు. మురళీమోహన్ చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె చక్రవర్తి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కృష్ణానది వరదల సమయంలో లంక గ్రామాల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు చేసిన సేవలకు గుర్తింపుగా, పాత గ్రంథాలయం స్నేహితుల సంఘం స్థాపించి పుస్తకాలు, ఫర్నిచర్‌ను రెండు గ్రంథాలయాలకు గుంటూరులో అందజేసిన సందర్భంగా, సిపిఎస్ ఉద్యోగులకు చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు అందుకున్నట్లు చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో ఎం శ్రీనివాసరావు, బి బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరమ్మ ఉన్నారు.



రోటరీ అధ్యక్షునిగా వేజెండ్ల శ్రీనివాసరావు

రోటరీ అధ్యక్షుడిగా 'వేజెండ్ల'

ప్రజాశక్తి - బాపట్ల

రోటరీ క్లబ్ 69వ అధ్యక్షునిగా వేజెండ్ల శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో జరిగిన 2025 -26 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారి కొత్త సుబ్బారావును డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్‌వి రాంప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ రోటరీ సేవలు విస్తృతం చేయాలని అన్నారు. రోటరీలో మహిళా సభ్యులను భాగస్వామ్యం చేయాలని కోరారు. అసిస్టెంట్ గవర్నర్ పి రాఘవయ్య మాట్లాడుతూ సమాజ సేవలో రోటరీ ఉన్నతమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. నూతన సభ్యుడిగా చేరిన పి కుమార్‌తో ప్రమాణం చేయించారు. అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సభ్యుల సహాయ సహకారాలతో మరింత విస్తృతంగా సేవలు అందిస్తామని తెలిపారు. రోటరీ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్ సౌజన్యంతో ప్రాథమిక పాఠశాలలకు కూలింగ్ వాటర్ క్యాన్లు, సేవా సంస్థకు 10 సీలింగ్ ఫ్యాన్లు, వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఏరియా వైద్యశాల సూపర్నెంట్ సిద్ధార్థ, వివేకానంద కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఎన్ త్రివేణిని ఘనంగా సన్మానించారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లగా ఇ హరిబాబు, జెవి కృష్ణారావు, కొల్లా శ్రీనివాసరావు, ఎస్ రమేష్ బాబు, బుర్లే రామ సుబ్బారావు, ఎం సుధీర్ కుమార్, శివన్నారాయణ, టి కృష్ణమూర్తి, షేక్ మస్తాన్‌వల్లి, సిహెచ్ వెంకటేశ్వరరావు, టి మల్లికార్జునరావు, పి సుబ్బారావు, బి శివరామకృష్ణను ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఉపేంద్ర గుప్తా, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జెసిబితో పనులు చేస్తున్న దృశ్యం

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పోలూరు, వయా వింజనంపాడు, తిమ్మరాజుపాలెం రోడ్డు నిర్మాణ పనులు రూ.10.50 కోట్లుతో, బొల్లాపల్లి రహదారి, వింజనంపాడు, తిమ్మరాజు పాలెం రహదారి పనులు రూ.65లక్షలతో ప్రారంభించారు. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కృషితో రూ.కోట్ల నిధులతో రహదారుల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత ఐదేళ్లు సరైన రహదారి లేక అవస్థలు పడిన ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి 16 నుంచి బొల్లాపల్లి వరకు, పోలూరు నుండి వింజనంపాడు, తిమ్మరాజుపాలెం రోడ్డు పనులు ప్రారంభించారు. పోలూరు వయ్యా వింజనం పాడు, తిమ్మరాజుపాలెం రోడ్డు నిర్మాణానికి రూ.10.50 కోట్లతో నిధులు మంజూరు చేశారు. గత ఐదేళ్లు అస్తవ్యస్త అధ్వానపు రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన నేపథ్యంలో త్వరగా చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుపై ప్రయాణించాలంటేనే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని భయాందోళనకు గురైన పరిస్థితి ఉండేది. అలాంటి రోడ్డు పనులు ప్రస్తుతం ప్రారంభించారు. బొల్లాపల్లి రోడ్డు, వింజనంపాడు నుంచి తిమ్మరాజు పాలెం రహదారులు బీటీ రోడ్లతో కళకళలాడనున్నాయి.

అసంపూర్తిగా పాఠశాల భవన నిర్మాణం

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని హై స్కూల్ భవనం
- శిథిలావస్థకు చేరుతున్న పాఠశాల భవనం
- ఈ ప్రభుత్వంలోనైనా నిర్మాణం పూర్తవుతుందా?

ప్రజాశక్తి - పంగులూరు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ఐదేళ్ల క్రితం నిర్మాణం పూర్తి కావాల్సిన భవనం అసంపూర్తిగా దర్శనమిస్తుంది. విద్యార్థులు పాఠాలు నేర్చుకోవలసిన పాఠశాల ఆలనా, పాలన లేకుండా వెక్కిరిస్తుంది. దేనికీ పనికి రాకుండా ఉంది. విద్యార్థులకు చక్కని భవిష్యత్తు ఇవ్వాల్సిన తరగతి గదులు, శిథిలావస్థకు చేరుకుంది. మండల కేంద్రమైన పంగులూరు జెడ్పి ఉన్నత పాఠశాలకు అదనపు తరగతులు అవసరమని ప్రతిపాదించారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో నా బార్డు నిధులు రూ.1.18 కోట్లను కేటాయించారు. ఇందు కోసం 2020 అక్టోబర్ 17న అప్పటి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ద్వారా శంకుస్థాపన చేయించారు. నిర్మాణ బాధ్యతలను అయ్యప్ప కన్స్ట్రక్షన్స్ సంస్థకు అప్పచెప్పారు. అయితే ఆ సంస్థ సక్రమంగా పని చేయకుండా రకరకాల వారికి పని సబ్ కాంట్రాక్టుకు అప్పగించడంతో వాళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. దీంతో భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. భవనంను క్రింద వైపు గదులు పూర్తి చేసి పైన గదులకు పిల్లర్స్ వేశారు. అక్కడ నుండి ఎలాంటి పనులు చేయకుండా వదిలేశారు. సుమారు నాలుగేళ్లుగా ఈ భవన నిర్మాణం పనులు నిలిచిపోయాయి. దాని ఆలనా పాలన పట్టించుకునే నాధుడు లేకపోవడంతో భవనం చూసేవారికి శిథిలావస్థకు చేరినట్లుగా కనిపిస్తుంది. ఇనుప రాడ్లు తుప్పు పట్టి పనికిరాకుండా పోయే పరిస్థితికి దాపురించింది. ఈ పాఠశాల్లో 350 మందిపైగా విద్యార్థులు చదువు కుంటున్నారు. గదుల కొరత ఇక్కడ ఉంది. ఆధునిక వసతులతో, అధునాతన పద్ధతుల్లో నిర్మించాల్సిన భవనం అర్ధాంతంగా నిర్మాణం ఆగిపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. నాబార్డు ద్వారా నిధులు మంజూరు కావడం వలన, నాడు, నేడు పథకం ద్వారా నిధులు మంజూరయ్యే అవకాశం లేదు. అటు నాబార్డ్ ద్వారా వచ్చిన నిధులు ఉపయోగపడకపోగా, ఇటు నాడు, నేడు నిధులు వచ్చే అవకాశం లేదు. విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే తీర్చి దిద్దబడుతుందన్న పెద్దల మాట ఎలా ఉన్నా, ఇక్కడ తరగతి గదులు ఆలనా, పాలనా లేకుండా పోవడం విస్మయం కలిగిస్తుంది. కూటమి ప్రభుత్వమైనా ఈ పాఠశాల పరిస్థితిని పట్టించుకుని, త్వరగ తిన భవన నిర్మాణం పూర్తి చేయాలని, విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తిగా పంగులూరు హై స్కూల్ భవనం, శంకుస్థాపన శిలాఫలకం

సిఎం సహాయనిధి కొండంత అండ



చెక్కులు అందజేస్తున్న నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకునేందుకు బాధపడుతున్న పేదలకు సిఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో రూ.14.15లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కలను అర్హులైన 25మంది లబ్ధిదారులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలం పెదలంకకు చెందిన వేములపల్లి ఫణి రత్న కిషోర్, చుండూరుకు చెందిన గొర్రెపాటి వెంకటరెడ్డి అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసమైన ఖర్చులను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఫార్సు ద్వారా సిఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి పంపించారు. సిఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.5.84లక్షలు వేములపల్లి ఫణి రత్న కిషోర్‌కు, రూ.1.69లక్షలు గొర్రెపాటి వెంకటరెడ్డికి మొత్తం రు.7.54లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవభక్తుని నాగవీరా బసవయ్య పాల్గొన్నారు.



సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఆనందబాబు

ఏలూరి సొంత నిధులతో 'ఆలేరు' ఆధునికీకరణ

- వాగు గండ్లు పూడ్చివేత
- వాగు కట్టలు బలోపేతం
- యుద్ధ ప్రాతిపదికన పనులు



జెసిబితో ఆలేరు వాగు పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

చీరాల డ్రైనేజీ కార్యాలయ పరిధిలో అనేక ఏళ్ళుగా ఆధునికరణకు నోచుకోక అస్తవ్యస్తంగా ఉన్న ఆలేరు వాగుకు మహర్దశ పట్టింది. వరదలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు తన సొంత నిధులతో ఆలేరు వాగు కట్టలు పటిష్ట పర్చేందుకు ముందుకు వచ్చారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో వర్షాలకు తెగిపోయిన వాగు కట్టల గండ్లు పూడ్చి వేయటం, కట్టపై వాగులో అంచునున్న ముళ్ళ పొదలు, చెట్లను తొలగించటం, కాలువలో పేరుకు పోయిన చెత్త, ఒండ్రు మట్టి తొలగించే పనులు చేపట్టారు. సంతరావూరు నుంచి కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, నాయుడువారి పాలెం, దగ్గుబాడు, పావులూరు వరకు వరద కాలవ ఆధునికరిస్తున్నారు. అనేక ఏళ్లుగా వాగు ఆధునికరణకు నోచుకోకపోవడంతో వాగు పొంగిపొర్లుతుందని, 30 చోట్ల గండ్లు పడి వరదల సమయంలో పంట భూములన్ని నీట మునుగుతున్నాయని రైతులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. తన సొంత నిధులతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ఆలేరు వాగు కట్టల ఆధునికరణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేసి అన్నదాతలకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు వాగు ముంపు బాధిత రైతులు ధన్యవాదాలు తెలిపారు.

వరదకు ముప్పుకు అడ్డుకట్ట

ఆలేరు వాగు ఆధునికరణ పనులతో వరద ముప్పు నుంచి పంటలకు రక్షణతో పాటు పలు ప్రాంతాల్లో చెక్ డ్యాంలు, ఎత్తిపోతల పథకాలకు సాగునీరు పుష్కలంగా అందే అవకాశం ఉందని ఆ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం అందిస్తాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

అర్హులైన లబ్దిదారులు అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టినట్లు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలోని 8వ వార్డు జమేదారుపేటలో ఆయన శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి తమ ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమం వివరాల కరపత్రాలు ప్రజలకు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక టిడిపి నాయకత్వానికి సూచించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, చింతా యేశోబు పాల్గొన్నారు.

చీరాల : ప్రజల కష్టాలు తీరేలా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్య తెలిపారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా మండలంలోని బుర్లవారిపాలెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం యువనాయకులు గౌరీ అమర్నాద్‌తో కలిసి నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజలకున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు చర్యల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడి తప్పిందని అన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను తిరిగి నిలబెట్టి, సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా సుపరిపాలన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్దన్ పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గం అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. టీడీపీ శ్రేణుల్లో చైతన్యం నింపే ఉద్దేశంతో స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ ప్రతిష్ట పెంచే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామ, వార్డు స్థాయి నేతలు తమ పరిధిలో పార్టీ కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు.



అక్విడెక్ట్ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

అక్విడెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు సమీపంలోని వెల్లటూరు ఛానల్ ఆక్విడేక్ట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతుల సాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాన్ని మురళీధర్ సూచించారు. అక్విటెక్టివ్ నిర్మాణ పనులను ఆయనతోపాటు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలంతో పాటు వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలంలోని గ్రామాల్లో పంట పొలాలకు సాగునీరు అందించే ప్రధానమైన వెల్లటూరు ఛానల్‌పై రూ.10.75 కోట్ల నిధులతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ అక్విడెక్ట్ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సకాలంలో నీరు అందించే విధంగా పనులు త్వరగా పూర్తి చేయలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. దీనితోపాటు సాగునీటి, మురుగు కాలువలపై ఇప్పటికే పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, ఆయా ప్రాంతాల్లో అవసరమైన వంతెనలు కూడా నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఏ విధంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ అక్విడెక్ట్ నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీరివెంట నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది, నీటి సంఘం సభ్యులు ఉన్నారు.

అద్దంకి నుంచి తిరుపతికి ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి అద్దంకి

అద్దంకి పరిసర ప్రాంత ప్రజానీకానికి మెరుగైన రవాణా సేవలు అందించేందుకు డిపోలో ఐదు నూతన బస్సులను ఇటీవల మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించారు. దీనిలో భాగంగా తిరుపతికి ప్రతిరోజు రాత్రి 8.30గంటలకు అద్దంకి డిపో నుండి బస్సు బయలు దేరుతుందని 4.30గంటలకు తిరుపతి చేరుకుంటుందని డిపో మేనేజర్ బి రామ్మోహనరావు తెలిపారు. అదే రోజు ఉదయం 8:30గంటలకు తిరుపతి నుండి బయలుదేరి సాయంత్రం 4.15గంటలకు అద్దంకి చేరుకుంటుందని అన్నారు. రూ.440తో తిరుపతి చేరుకోవచ్చని తెలిపారు. అద్దంకి పరిసర గ్రామాల ప్రజలు తిరుపతి పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవినీతి అక్రమార్కుడికి సొసైటీ చైర్మన్ పదవా?

ప్రజాశక్తి - వేమూరు

అవినీతి అక్రమార్కులతో ప్రజల వ్యతిరేకతను కూడగట్టుకున్న వ్యక్తికి రైతు ప్రయోజనాలు కాపాడే విలువైన పిఎసిఎస్ చైర్మన్ పదవిని ఏ విధంగా అప్పగిస్తారని మండల రైతాంగం ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రంలో 50శాతం పైగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా వేమూరు పిఎసిఎస్ పదవిని చావలి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఊస రాజేష్‌కు అప్పగించింది. రాజేష్‌కు ఈ పదవిని ప్రకటించడం పట్ల మండలంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే ఈ పదవిని రాజేష్‌కు కేటాయించటం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో జనసేన నాయకుడిగా ఉన్న రాజేష్ తండ్రి శివ నాగేశ్వరరావు చావలిలో ప్రధాన రహదారి వెంట ఉన్న పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి పొజిషన్ సర్టిఫికెట్ తీసుకొని కొల్లూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం లో తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో అక్రమ ఆక్రమణలు తొలగించాలని, దీనికి బాధ్యులైన అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. కోర్టులో పంచాయతీ కార్యదర్శి సరైన సమాధానం చెప్పకపోవడంతో అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాక రాజేష్ తండ్రి వనాగేశ్వరరావు అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న దృష్ట్యా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి అతని నుండి మద్యం బాటిళు స్వాదీనం చేసుకుని అతనిపై కేసులు కూడా నమోదు చేశారు. ఇదిలా ఉండగా రాజేష్ వర్గం అక్రమ మైనింగ్ వ్యాపారానికి తేరలేపి అక్రమార్జనకు పాల్పడటంతో రాజేష్‌పై ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.



చెరువు పోరంబోకు స్థలంలో రాజేష్ నిర్మించిన భవనం

దళితుడిపై దాడి కేసులో రాజేష్‌కు సోకజ్ నోటీస్

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఇదే గ్రామానికి చెందిన బి కొండయ్య అనే దళితునిపై ఉషా రాజేష్ దాడి చేసిన ఘటనలో అతనిపై పోలీస్ స్టేషన్లో అట్రాసిటీ కేసు నమోదైంది. ఎందుకు క్రమశిక్షణ చర్యలు చేపట్ట కూడదని అధిష్టానంకు సంజాయిషీ తెలపాలని రాష్ట్ర కార్యాలయం నుండి ఏప్రిల్ 26న జనసేన రాష్ట్ర పార్టీ హెడ్ వేములపాటి అజయ్ కుమార్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుకు ఎలాంటి సంజాయిషీ, సమాధానం చెప్పిన దాఖలాలు లేవని తెలిసింది. డ్వాక్రా గ్రూప్ సభ్యులకు తెలియకుండా రూ.3లక్షలు తీసుకుని స్వంతానికి వాడుకునేందుకు సిద్ధపడి రాజేష్, ఎపిఎం శోభన్ గ్రూపు లీడర్ సునంద కలసి గ్రూప్ సభ్యులతో సంతకాలు చేయించుకునేందుకు ప్రయత్నించి ఆ గ్రూప్ మహిళలను బెదిరించి డబ్బులు డ్రా చేసుకోవడంతో గత మే నెల 5న జిల్లా ఎస్‌పికి పిర్యాదు చేశారు. ఇలాంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వం, జనసేన పార్టీ అధిష్టానానికి సంబంధం లేకుండా, తెలియకుండా అత్యంత బాధ్యత కలిగిన సొసైటీ చైర్మన్ పదవిని ఏ విధంగా అప్పగిస్తారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. పిఎసిఎస్ చైర్ పర్సన్ పదవి విషయంలో పునపరిశీలన చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రైల్వే అభివృద్ధి పనుల్లో అవినీతిమయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రజాధనంతో నిర్మించే రైల్వే రోడ్డు పనులకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నాణ్యత కోల్పోతున్నాయి. భట్టిప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో నాలుగేళ్ల క్రితం నిర్మించిన అండర్ టన్నెల్ నిరుపయోగంతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయి. దీని స్థానంలో రైతుల సౌకర్యం కోసం అండర్ టెన్ ఉన్న ప్రాంతంలో మరో రు.1.50 కోట్ల వ్యయంతో వెల్లటూరు ఛానల్‌పై వంతెన నిర్మిస్తున్నారు. దానికి అనుసంధానంగా వెల్లటూరు రోడ్లో రైల్వే గేటు నుండి ఏర్పాటు చేస్తున్న రహదారి పనులు పూర్తి అవినీతిమయంగా కనిపిస్తోంది. తాత్కాలికంగా కొంత మట్టిని రహదారికి తోలించి దీనికి ఇరువైపుల ఉన్న రైల్వే స్థలంలో గుంటలు ఏర్పాటు చేసి మట్టిని జెసిబి ద్వారా రహదారి నింపుతున్నారు. ఇరువైపులా మట్టి తీసి ఏర్పాటు చేస్తే వర్షాకాలంలో రహదారి గుంటల్లోకి జారిపోయి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పూర్తి చేసి రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు చేతులు దులుపుకొని వెళ్లిపోతే ఇక్కడ రైతుల పరిస్థితేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి నిర్మాణ పనుల నాణ్యతా పరంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డు సైడు గుంటల్లో నల్లమట్టితో వేస్తున్న రోడ్డు



రోటరీ భవన్‌లో యోగ చేస్తున్న గ్రామస్తులు

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కేంద్రాన్ని స్థానిక రోటరీ భవన్లో శనివారం ప్రారంభించారు. యోగ గురువు కటారి సత్యనారాయణ యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. శిక్షణా శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు యోగా శిక్షణ మొదలవుతుందని తెలిపారు. అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖరరావు, పాబోలు వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ సబ్సిడీతో పశువులకు బీమా

ప్రజాశక్తి - పంగులూరు



డాక్టర్ ఎం మురళీకృష్ణ

ప్రభుత్వం సబ్సిడీతో పశువులకు భీమా సౌకర్యం కల్పిస్తుందని స్థానిక పశువైద్యశాల ఇన్‌ఛార్జి వైద్యులు డాక్టర్ ఎం మురళీ కృష్ణ చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, దారిద్రరేఖకు దిగువునున్న కుటుంబాలకు చెందిన పశువులకు మాత్రం సబ్సిడీతో భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక కుటుంబానికి గరిష్టంగా పది పశువుల వరకు భీమావర్తిస్తుందని తెలిపారు. ఒకసారి బీమా చేస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుందని చెప్పారు. పశువులకు చెవిపోగు వేయించి భీమాలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ చెవిపోగు పోయినచో పశు సంవర్ధక శాఖ సిబ్బందికి విషయం తెలిపి మరొకటి చెవిపోగు వేయించి, బీమాలో నమోదు చేయించాలని అన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ సబ్సిడీ నాటు పశువులకు రూ.816, మేలు జాతి పశువులకు రూ.1,632 వరకు మాత్రమే వర్తిస్తుందని అన్నారు. పశువులు, జివాలకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా వ్యాక్సిన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామాల్లో గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. పశువులు, జివాల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు పశువుల షెడ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందజేసే రాయితీని ఉపయోగించుకోవాలని సూచించారు. మండలంలోని పంగులూరు, ముప్పవరం, రామకూరు పశు వైద్యశాల పరిధిలో 20 మెట్రిక్ టన్నుల పశువుల దాన సబ్సిడీపై అమ్మినట్లు చెప్పారు. నట్టల నివారణ మందును 19,559 గొర్రెలు, మేకలకు, బ్లూ టంగు నివారణ వ్యాక్సిన్ 13,531 గొర్రెలు, మేకలకు వేసినట్లు తెలిపారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు వేగవంతం

- కొత్తగా 18 కేంద్రాలు ఏర్పాటు
- రోజుకు 600 టన్నుల కొనుగోలు టార్గెట్
- బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు బాపట్ల జిల్లా యంత్రాంగం కీలక చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులతో శనివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎలాంటి నిరాశకు లోనవవద్దని ప్రభుత్వం రైతు పక్షాన నిలిచి ప్రతి రైతు పండించిన పొగాకును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు అపోహలకు లోనవకూడదని, సరైన సమాచారం కోసం మండల, జిల్లా స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు.

కొత్తగా 18 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

ఇప్పటివరకు జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 14న



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

మరో మూడు కేంద్రాలు చిన్నగంజాం, మార్టూరు, అడుసువల్లిలో ప్రారంభిస్తారన్నారు. 16న సంతమాగులూరు, తమ్మవరంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. వచ్చే వారంలోనే మరో ఏడు కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 18 కేంద్రాలు అందుబాటులోకి వస్తే రోజుకు సగటున 600 టన్నుల పొగాకును కొనుగోలు చేస్తారన్నారు.రైతులకు షెడ్యూల్ వివరాలు నెల ముందుగానే ఫోన్ మెసేజ్ ద్వారా చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో స్టాక్ నిల్వ సమస్యలు తలెత్తకుండా తగిన గిడ్డంగులను ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో 24 గంటల భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రెవిన్యూ, పోలీస్ పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు.

16న ప్రైవేట్ బయర్లతో సమావేశం

ఈనెల 16న ప్రైవేట్ బయర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన పొగాకు స్టాక్‌కు ఆడిట్ విధానాన్ని అమలు చేస్తారని తెలిపారు. రైతుల వద్ద నుంచి ప్రైవేట్ వ్యక్తులు పొగాకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని, అలాంటి చర్యలకు పాల్పడే అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. పండుగుళ్ల ఆకు కొనుగోలుపై త్వరలోనే ప్రత్యేక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. రైతుల న్యాయమైన ధరల కోసం కిలో ధర రూ.30 నుంచి రూ. 40 నిర్ణయించే అవకాశముందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డిఎం కరుణ శ్రీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకష్ణ, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్, ఆర్‌డిఒలు గ్లోరియా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన చెక్కులను బాధితులకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ వివిధ ఆరోగ్య కారణాలతో ఆసుపత్రిలలో వైద్య సహాయం పొంది వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న వారికి కొంత ఊరటగా సిఎం చంద్రబాబు నాయుడు ఆర్థిక సహాయం మంజూరు చేశారన్నారు. 45 మందికి రూ.77 లక్షల 56 వేల రూపాయల చెక్కులను అందజేసి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు నగర అధ్యక్షుడు బండారు మదన్, టిడిపి నాయకులు రాచగర్ల వెంకట్రావు, చుండి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కమిషనర్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం జెపి చెరువు గ్రామ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంనున్న నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో శనివారం స్వామి శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా నంద్యాల నగరపాలక సంస్థ కమిషనర్ పి.శేషన్న సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ మల్లవరపు నాగయ్య అధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు


అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ యూనియన్ ప్రకటించింది. ఒంగోలు మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి. మహేష్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా కార్మికులు కనీస వేతనాల రాక ఇక్కట్లు పడుతున్నారన్నారు.ప్రభుత్వ హామీలు అమలు కానందుకు నిరసనగా సమ్మె నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి సమ్మెను విరమింపజేసిందని, కానీ జీవోలు ఇవ్వక పోవడం వల్ల సమస్యలు తిరిగి ఉత్పన్నమయ్యాయని తెలిపారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా వేతనాల పెంపు విషయంలో ఏలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదని విమర్శించారు. జీవో నెంబర్ 37 ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింప జేయాలన్నారు. గత సమ్మెకాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేసి తమ హక్కులు సాధించుకోవాలని యూనియన్ నేతలు కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో జి. నరసింహ, టి. విజయమ్మ, కె.వెంకట్రావు, జానయ్య, జాలయ్య, మోహన్‌రావు, ప్రతాప్, నరసింహ, శ్రీదేవి, లక్ష్మీప్రసన్న, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న డిమాండ్స్‌తో నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ప్రకాశం, బాపట్ల జిల్లాలో 40 వేల మంది కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో భాగస్వామ్యం అయ్యారు. రెండు జిల్లాల లోని అన్ని మండలాల్లో సమ్మె సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ఎల్ఐసి, ఐఎల్‌టిడి కంపెనీల్లో 100 శాతం సమ్మె జయప్రదంగా జరిగింది. ఈ సమ్మెలో రైల్వే ,రోడ్డు రవాణా, విద్యుత్తు, పోస్టల్, టెలికం, బ్యాంకింగ్, బీమా ,స్కీం వర్కర్లు, మున్సిపల్, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సమ్మెకు మద్దతు తెలిపి ఆందోళనల్లో పాల్గొన్నారు.



అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఎసిబి అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాధి .కారులు అవినీతి చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు. గిద్దలూరు సబ్ రిజిస్టర్ ఎన్. కష్ణమోహన్ ఒ ఇంటి గిఫ్ట్‌డీడ్ విషయమై రూ.35 వేలు లంచం తీసుకుంటూ ఎబిసికి పట్టుబడ్డాడు. ఆయన స్వస్థలం చీరాల కావడంతో ఇక్కడి నివాసంలోనూ అధికారులు సోదాలు నిర్వహించారు. కీలకమైన డాక్యుమెంట్లు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా లోని పశ్చిమ ప్రాంతంలో వరుసగా అధికారులు లంచాలు తీసుకుంటూ పట్టుబడడం గమనార్హం.

రాష్టంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది డిసెంబరు 7న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరంలో ఈనెల 10న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమం చేపట్టారు. అన్ని పాఠశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయకుండా,విద్యారంగ అభివృద్ధికి నిధుల కేటాయింపులు లేకుండా ప్రచారం కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారన్న విమర్శలు వచ్చాయి.

కంభం మండలం లింగోజిపల్లెకు చెందిన పొదిలి లక్షిత్ అనే బాలుడు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వస్తూ అదశ్యమయ్యాడు. అనంతరం సూరేపల్లి గ్రామం సమీపంలోని పొలాలలో బాలుడి మతదేహం కనపడడం కలకలం రేపింది. బాలుడు హత్యకు గురయ్యాడా లేక దారి తప్పి మంచినీరు, ఆహారం లభించక మరణించాడా అన్న విషయమై స్పష్టత రాలేదు.

అధికారులు పి-4 అమలులో తలమున కలవుతున్నారు. బంగారు కుటుంబాల గుర్తింపు వారిని దత్తత తీసుకునే మార్గదర్శిల ఎంపికల్లో ఉన్నారు. బాపట్ల జిల్లాలో 62,388 బంగారు కుటుంబాలు ఉంటే 44,920 కుటుంబాలను 3,528 మంది మార్గదర్శిలకు దత్తత ఇవ్వడంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశంసలందుకున్నారు. వాస్తవంగా పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా, వారిని పేదరికం నుంచి బయటికి తెచ్చేందుకు చేపట్టిన పి-4 కార్యక్రమం లక్ష్యానికి చాలా దూరంలో ఉంది. పేదలకు మంచి జీవితం ఇవ్వడం అంటే ఆ కుటుంబాలలోని వారికి రుణం ఇవ్వడం,పిల్లలకు పుస్తకాలు,వికలాంగులకు ట్రైసైకిళ్లు ఇవ్వడం అన్నట్లుగా ఉంది. వారిని పేదరికం నుంచి బయటకు తెచ్చే పనులు చేపడుతున్న పరిస్థితి లేదు.

ఉచిత ఇసుక పాలసీ పూర్తిగా అటకెక్కింది. అధికారం అండగా ఇసుక యథేశ్ఛగా అక్రమ మార్గాల్లో తరలిపోతుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంతో పాటు, ప్రభుత్వ భూములు,పట్టా భూముల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక కోసం సామాన్యులు నానా తంటాలు పడి కొనుక్కుంటున్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అధికారిక ఇసుక రీచ్‌లు లేకపోవడం అక్రమార్కులకు ఇసుక వరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తరలింపులకు పాల్పడిన వారు ఇప్పుడు అధికార పార్టీలో చేరి పోయి యథేశ్ఛగా ఇసుక అక్రమ తరలిస్తున్నారు. జెసిబిలు, టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

రేషన్ బియ్యం అక్రమ అమ్మకాలు కూడా యథేశ్ఛగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల వారీగా రేషన్ బియ్యం అమ్మకాల్లో ఆరితేరిన వారు రంగంలోకి దిగారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎలాగా రేషన్ బియ్యం అమ్మకాలు జరిపారో అంతకు మించిన రీతిలో జోరుగా రేషన్ దందా సాగుతుంది. ప్రతినెలా క్రమం తప్పకుండా వచ్చే ఆదాయంగా ఉన్న రేషన్ బియ్యం దందాను అధికార పార్టీ నేతలు కూడా వదులుకోవడం లేదు. నెలకు ఇంత అని మామూళ్ళు నిర్ణయించి మరీ దందా కొనసాగిస్తున్నారు. గతంలో రేషన్ దందా జరుపుతున్న వారిపై అప్పుడప్పుడు అధికారులు దాడులు జరిపేవారు. ఇప్పుడు అవికూడా లేవు.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా